# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కృత్రిమ మేధా శక్తిని భవిష్యత్తులో ప్రపంచం ఎలా ఉపయోగించుకుంటుందో చెప్పడానికి గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఒక కీలక మైలురాయిగా మారిందని మన్ కి బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **డిజిటల్ అరెస్ట్ పట్ల ప్రజలు అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

3. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు కేంద్రమంత్రులు జ్యోతిరాధిత్య సింధియా, పెమ్మసాని చంద్ర శేఖర్‌లు గుంటూరులో ఈరోజు పర్యటిస్తారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాల్లో రేపటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.**

5. **ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్‌లో భాగంగా సూపర్ 8 గ్రూప్ 1లో అహ్మదాబాద్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.**

==========================

కృత్రిమ మేధా శక్తిని భవిష్యత్తులో ప్రపంచం ఎలా ఉపయోగించుకుంటుందో చెప్పడానికి గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఒక కీలక మైలురాయిగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కి బాత్ 131వ సంచిక కార్యక్రమంలో పలు అంశాలపై ప్రధానమంత్రి ఈ రోజు ప్రసంగించారు. ఈ సదస్సులో రెండు భారతీయ ఉత్పత్తులు ప్రపంచ నాయకులను బాగా ఆకట్టుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

--------------------------

డిజిటల్ అరెస్ట్ పట్ల ప్రజలు అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈరోజు రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో ప్రధాని డిజిటల్ అరెస్ట్‌పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటీపీ, ఆధార్ నంబర్ ...నంబర్ లేదా బ్యాంక్ ఖాతా సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని

ఆయన చెప్పారు. ముఖ్యంగా  పాస్‌వర్డ్‌ను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచిస్తూ..

వాయిస్…30 సెకన్లు

----------------------------

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అధిక ఒత్తిడికి లోనుకావద్దని ప్రధానమంత్రి సూచించారు. పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని గుర్తు చేస్తూ ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన పలు విషయాలు మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు  రాసే సమయంలో చదివిన అంశాలను మననం చేసుకుని పూర్తిగా రాయాలని, ఒక ప్రశ్న తెలియకపోయినా దానికే భయపడకుండా ముందుకు సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచిస్తూ..

వాయిస్…20 సెకన్లు

----------------------------

పండుగల సందర్భంగా 'వోకల్ ఫర్ లోకల్' భావనకు ప్రాధాన్యమిస్తూ స్వదేశీ … ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్‌లో ఆయన మాట్లాడారు. విదేశీ తయారీ వస్తువులను పండుగల నుంచి దూరంగా ఉంచి, దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ దిశగా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ..

వాయిస్…24 సెకన్లు

----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి  జ్యోతిరాధిత్య సింధియా, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌లతో కలిసి గుంటూరులో ఈరోజు పర్యటిస్తారు. భారత్ నెట్‌కు సంబంధించిన ఒప్పందంపై ఇరువురు నేతలు సంతకాలు చేయనున్నారు. అనంతరం నగరంలోని బొమ్మిడాల నగర్‌లో నిర్వహించనున్న గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

----------------------------

కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్ పథకం' కింద రాష్ట్రంలోని దేవాలయాల పక్కనే ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. చిత్తూరుజిల్లాలోని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని కేంద్రమంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి త్వరలో మరిన్ని పరిశ్రమలు రానున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు  వెల్లడిస్తూ..

వాయిస్…30 సెకన్లు

----------------------------

రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాల్లో రేపటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1531తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

-------------------------

ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్‌లో భాగంగా సూపర్ 8 గ్రూప్ 1లో అహ్మదాబాద్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. గ్రూప్ 2లో పల్లెకలె వేదికగా ఇంగ్లాండ్‌తో శ్రీలంక తలపడనుంది. నిన్న కొలంబో వేదికగా జరగాల్సిన పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో ఇరు జట్లకు చెరొక పాయింట్ కేటాయించారు.

-------------------------

ఆదాయ వృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు దిశగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందని వ్యవసాయశాఖ మంత్రి కే.అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను తిరుమలలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేసిన పథకాల కింద కేంద్ర వాటాగా మొత్తం 695 కోట్ల రూపాయలకు గాను ఇంకా 645 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉందని , వాటిని వెంటనే విడుదల చేయాలని మంత్రి, కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

-------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని గోదావరి ఏటి గట్లను బలోపేతం చేసే పనులను నాణ్యతతో చేపట్టాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. 16 కోట్ల 72 లక్షల రూపాయలతో చేపట్టిన గోదావరి ఏటిగట్టు పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్న తీరును చూసి సంబంధిత అధికారులు, ఏజెన్సీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పనుల్లో ఎక్కడ లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించేలా వేగవంతంగా చేయాలని చెప్పారు.

-------------------------

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో ఇప్పటి వరకూ 6 కోట్ల రూపాయలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 50 లక్షల రూపాయలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, పల్లె పండగ, సాస్కి నిధులతో రహదారులు, డ్రైన్లు, గోకులాలు తదితర నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు.

=====================